సాక్షి మంచిర్యాల

మంగళవారం । 29 । జులై । 2025



టైగర్ లేని జోన్!
కవ్వాల్ టైగర్‌జోన్‌లో పెద్దపులులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా ఇక్కడ పులి ఆవాసం ప్రశ్నార్థకంగా మారింది.
8లో▸



నాగమ్మా.. దీవించు
నాగుల పంచమి.. శ్రావణ శుక్లపంచమి నాగారాధనకు శ్రేష్ఠమని విశ్వసిస్తారు. భక్తులు పాము పుట్టల్లో పాలు పోసి తమ భక్తిని చాటుకుంటారు.
8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
30.1 /26.3
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో ఒకటి రెండుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఖేలో ఇండియాలో శిక్షణ పొందుతున్న బాక్సింగ్ క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లోని షేక్‌పేట్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చినట్లు కోచ్ సీహెచ్.రాజేశ్ తెలిపారు. బాలుర విభాగంలో బి.అనురాగ్ (55 నుంచి 58 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్), ఎం. అశ్వత్ (43 నుంచి 46 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్), బి.రిత్విక్ కుమార్ (40 నుంచి 43 కేజీల విభాగంలో బ్రౌజ్ మెడల్), జి.శ్రీనాథ్ (33 నుంచి 35 కేజీల విభాగంలో బ్రౌజ్ మెడల్) సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులను జిల్లా క్రీడల శాఖ అధికారి జి.హనుమంత్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సోమవారం అభినందించారు.

'ఆంక్షలు ఎత్తేయకుంటే ఆందోళనలు ఉధృతం'


మాట్లాడుతున్న రఘునాథ్ వెర్రబెల్లి

జన్నారం: టైగర్‌జోన్ పేరుతో భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్ వెర్రబెల్లి అన్నారు. భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలని చేపట్టిన నిరాహారదీక్ష సోమవారం 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైగర్‌జోన్ పేరుతో ఆంక్షలు పెట్టడం ఈ ప్రాంత అభివృద్ధిని హరించడమేనన్నారు. వెంటనే ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, నాయకులు రమేశ్‌గౌడ్, సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

నేడు కేవీ నూతన భవనం ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటలో గల పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం (కేవీ) నూతన భవనాన్ని మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

15 రోజుల్లో ఎన్నికలు నిర్వహించండి..

- 'ఓరియంట్' గుర్తింపు ఎన్నికలపై హైకోర్టు ఆదేశాలు..!


ఓరియంట్ సిమెంట్ కంపెనీ

కాసిపేట: ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలు 15 రోజుల్లోగా నిర్వహించాలని సోమవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గతంలో పలుమార్లు కార్మికశాఖ అధికారులను హైకోర్టు హెచ్చరించినప్పటికీ పలు కారణాలతో వాయిదా వేస్తూ వస్తున్నారు. ఆగస్టు 13 లోగా ఎన్నికలు నిర్వహించి 20న హైకోర్టులో రిపోర్టు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇప్పటికైనా కార్మిక శాఖ నిద్రమత్తు వదిలి ఎన్నికల నిర్వహణకు ముందుకు వస్తుందా? లేక మళ్లీ సాకులు వెతుకుతూ ఎన్నికలు దూరం చేస్తుందా? అనే అనుమానాలు కార్మికుల్లో వ్యక్తమవుతున్నాయి.

మనుగడ పోరాటం..!

- ఆవాసం కోసం పులులు.. అస్తిత్వం కోసం ఆదివాసీలు
- పులుల సంరక్షణ చర్యలపై తీవ్ర వ్యతిరేకత
- కవ్వాల్‌లో జాతీయ జంతువుకు తిప్పలు
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం


కాగజ్‌నగర్ డివిజన్‌లో సంచరిస్తున్న పులి (ఫైల్)

'వాటి మనుగడ మన చేతుల్లోనే.. పులుల కోసం గర్జించు.. పులులు, అడవులు, ప్రాణాలను రక్షించు' ఈ ఏడాది అంతర్జాతీయ పులుల దినోత్సవ ఇతివృత్తమిది.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో పులుల సంరక్షణ చర్యలు.. ఆదివాసీల మనుగడ మధ్య సంఘర్షణ నెలకొంది. పులులతో జీవవైవిధ్యం కోసం అటవీశాఖ చర్యలు చేపడుతుండగా, స్థానిక గిరిజన సముదాయాలు అటవీ శాఖ ఆంక్షలను వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పులులను సంరక్షించి జీవవైవిధ్యం సాధించడం అటవీ శాఖకు సవాల్‌గా మారింది. ఏటా జూలై 29న నిర్వహించే అంతర్జాతీయ పులుల దినోత్సవం రోజున పులుల రక్షణ, అవగాహన పెంపొందించడంపై దృష్టి సారిస్తోంది. ఈసారి కవ్వాల్ రిజర్వ్‌లో పులుల సంచారం, మానవ–వన్యప్రాణి ఘర్షణలు, గిరిజనుల ఆందోళనలు అటవీ శాఖకు సవాళ్లుగా మారాయి.

మహారాష్ట్ర నుంచి పులుల వలస
మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా–అంధారీ అభయారణ్యాల నుంచి పెన్‌గంగా, ప్రాణహిత నదులు దాటి పులులు కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లోకి వలస వస్తున్నాయి. గడిచిన దశాబ్దంలో కాగజ్‌నగర్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో పులుల సంచారం పెరిగింది. 2012లో టైగర్ రిజర్వ్‌గా ప్రకటించిన కవ్వాల్‌లో 892.23 చదరపు కిలోమీటర్లు కోర్ ఏరియా, 1123.21 చదరపు కిలోమీటర్లు బఫర్ ఏరియా ఉన్నప్పటికీ పులి స్థిర ఆవాసం ఏర్పర్చుకోవడం లేదు. దీంతో ఇక్కడి పరిస్థితులు అనుకూలించక తిరిగి వెళ్లిపోతున్నాయి. కొన్ని వేటగాళ్లకు చిక్కి మృత్యువాతపడుతున్నాయి.

జీవో 49 దుమారం..
మే 30న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 49 ఉమ్మడి జిల్లాలో దుమారం రేపింది. ఈ జీవో ప్రకారం కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను తడోబా–అంధారీతో కలిపే కుమురం భీం కన్జర్వేషన్ రిజర్వ్‌గా 1.49 లక్షల హెక్టార్లను గుర్తించింది. ఈ ఉత్తర్వు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలో 339 గ్రామాలపై ఆంక్షలు విధించడంతో గిరిజన సంఘాలు నిరసనలు చేపట్టాయి. తుడుందెబ్బ సంఘం నాయకత్వంలో ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో బంద్ నిర్వహించారు. దీంతో ప్రభుత్వం జీవోను తాత్కాలికంగా నిలిపివేసింది. గిరిజనులు తమ జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

మానవ–వన్యప్రాణి సంఘర్షణ..
కవ్వాల్ రిజర్వ్‌లో మానవ–వన్యప్రాణి సంఘర్షణ తీవ్ర సమస్యగా ఉంది. నాలుగేళ్లలో పులు ల దాడుల్లో నలుగురు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. వందలాది పశువులు పులుల దాడితో చనిపోయాయి. పశువుల యజమానులకు పరిహారం అందినప్పటికీ, స్థానికుల్లో వ్యతిరేకత కొనసాగుతోంది. పులులు కూడా వేట, ఉచ్చులు, మానవ కార్యకలాపాలతో ముప్పు ఎదుర్కొంటున్నాయి. పోడు భూములు, సింగరేణి గనులు, సాగునీటి ప్రాజెక్టుల వద్ద పులుల సంచారం ఘర్షణలను పెంచుతోంది. చివరగా మహారాష్ట్ర నుంచి పులులను ఇక్కడికి తీసుకొచ్చే ప్రతిపాదనలు చేసున్నా, స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. వన్యప్రాణులు, మనుషుల మధ్య ఘర్షణ తగ్గించేలా చర్యలు తీసుకుంటేనే ఇరు వర్గాలకు ఊరట కలుగుతుంది.

పెద్దపులి సంచారం

కాసిపేట: మండలంలోని రొట్టెపల్లి, తిరుమలపూర్, వెంకటపూర్ గ్రామాల శివారులోని అటవీ ప్రాంతాల్లో నాలుగు రోజులుగా పెద్దపులి సంచరిస్తోంది. నాలుగు రోజుల క్రితమే పెద్దపులి సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించాయని ఆదివాసీల సమాచారంతో అటవీశాఖ అధికారులు వెంకటాపూర్ శివారులో గాలించగా ఆనవాళ్లు లభించలేదు. దీంతో మరో ప్రాంతంలో వెతికేందుకు సిద్ధపడగా శనివారం లేగదూడపై దాడి ఘటనతో పులి సంచరించే ప్రాంతం తెలిసింది. లేగదూడను హతమార్చిన చోట ట్రాఫింగ్ కెమెరాలు అమర్చగా సోమవారం వెళ్లి పరిశీలించారు. రాత్రి 12 గంటల సమయంలో లేగదూడ కళేబరం వద్దకు వచ్చినట్లు కెమెరాలో రికార్డయ్యింది. దీంతో పాదముద్రలు పరిశీలించి పాత తిరుమలపూర్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. సమీప గ్రామాల ప్రజలు ఒంటరిగా అటవీప్రాంతం వైపు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు.

రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి


ఆర్థికసాయం అందజేస్తున్న పూర్ణచందర్

కాసిపేట: మండలంలోని వెంకటాపూర్, రొట్టెపల్లి శివారులో పులి సంచరిస్తోందని, ఆయా ప్రాంతాల రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ రేంజ్ అధికారి పూర్ణ చందర్ సూచించారు. మండలంలోని రొట్టెపల్లి శివారు అటవీ ప్రాంతంలో ఆదివారం పెద్ద పులి దాడిలో లేగ దూడ మృతి చెందింది. సోమవారం దూడ యజమాని అచ్యుతరావుకు నష్టపరిహారం కింద బెల్లంపల్లి అటవీశాఖ కార్యాలయంలో రూ.8 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వన్య ప్రాణులకు ఎలాంటి నష్టం చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్, సెక్షన్ అధికారి సత్యనారాయణ, ఎఫ్‌బీవోలు, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

- ప్రజావాణిలో అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన సమస్యలపై ఫిర్యాదులను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. జన్నారం, దండేపల్లి మండల వాసులు లక్సెట్టిపేట నుంచి జన్నారం మీదుగా నిర్మల్, ఆదిలాబాద్ రాష్ట్ర రహదారులపై పగటిపూట భారీ వాహనాల రాకపోకలపై అటవీశాఖ విధించిన నిషేధం ఎత్తివేయాలని దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణంలోని టేకులబస్తీకి చెందిన తోట పోచన్న తన భూమిలో వేరేవ్యక్తి ఇల్లు ఉన్నట్లుగా ఇంటినంబర్ పొంది పట్టా తీసుకున్నాడని, దీనిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరాడు. బెల్లంపల్లికి చెందిన రాదండి లావణ్య తన పేరట చెన్నూర్ శివారులో ఉన్న భూమిలో కొంత మంది అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని, దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని అర్జీ అందజేసింది. కన్నెపల్లి మండలం సాలిగాంలో ఎర్రవాగుపై నిర్మించిన పీపీరావు ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురైన 20 కుటుంబాలు పరిహారం ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. పోస్టుమెట్రిక్ హాస్టళ్ల మెయింటనెన్సుకోసం అర్హతలేని ఏజెన్సీలకు కేటాయించిన టెండర్లు రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 72 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి



జైపూర్ మండలంలోని కిష్టాపూర్ ఐకేపీ శ్రీరామ ఎస్‌హెచ్ సంఘంలో జరిగిన చెల్లింపుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. గ్రూప్ సభ్యులకు తెలియకుండా సీఏ అక్రమ తీర్మాణాలు, సంతకాలు చేసి రూ.2 లక్షల రుణాలు ఇతర ఖాతాలోకి మళ్లించారు. గ్రూపులో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టి న్యాయం చేయాలి.
– కిష్టాపూర్ గ్రూప్ సభ్యులు

కొడుకులు పట్టించుకుంటలేరు



నాకు నలుగురు కొడుకులు, ఒక కుమార్తె సంతానం. నాభర్త, ఇద్దరు కుమారులు చనిపోయారు. నా పేరుమీద ఉన్న భూములు ఇద్దరు కుమారులు పట్టా చేసుకున్నారు. నన్ను పట్టించుకోవడం లేదు. పట్టా చేసుకున్న భూములు ఇప్పించి నాకు న్యాయం చేయాలి.
– అల్లంల కిష్టమ్మ, తపాల్‌పూర్, సింగరాయిపేట్, జన్నారం

విద్యుత్ స్తంభం తొలగించాలి



మా ఇంటి వద్ద ఉన్న విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరింది. కురుస్తున్న వర్షాలకు స్తంభానికి షాక్ వస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. స్తంభం తొలగించాలని ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కొత్త స్తంభం ఏర్పాటు చేసి ప్రమాదం జరగకుండా చూడాలి.
– కొరవి వెంకటేష్, ఇందారం, జైపూర్

వాహనదారులపై ఆర్థికభారం

- సేవల ఫీజు పెంచిన రవాణా శాఖ
- సోమవారం నుంచే అమలులోకి..


మంచిర్యాల జిల్లా రవాణా శాఖ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రవాణా శాఖ సేవలు మరింత భారంగా మారాయి. ప్రభుత్వం తాజాగా రవాణా శాఖలోని పలు సేవలకు సంబంధించి ఒక్కసారిగా ఫీజులు పెంచేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన లేకుండా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రాత్రికి రాత్రే రవాణా శాఖ వెబ్‌సైట్‌లో నూతన ఫీజులను అప్‌డేట్ చేశారు. దీంతో సోమవారం నుంచి నూతన చార్జీలు అమలులోకి వచ్చాయి. ఇందులో కొన్ని సేవలకు నామమాత్రంగా పెరుగగా మరికొన్ని సేవలకు చూస్తే 'జేబులు ఖాళీ చేసుకోవాల్సిందే' అన్న చందంగా ఉన్నాయి.

పెరిగిన సేవల ఫీజులు ఇలా..
ద్విచక్ర వాహనం లర్నింగ్ లైసెన్స్ పొందేందుకు గతంలో రూ.335 ఉండగా రూ.440కు పెంచారు. ద్విచక్ర వాహనం, కారు(లైట్ మోటార్ వెహికిల్) నడిపేందుకు పొందే లర్నింగ్ లైసెన్స్ ఫీజు రూ.450 నుంచి రూ.585కు పెరిగింది. పర్మినెంట్ లైసెన్స్‌కు డ్రైవింగ్ టెస్ట్ కోసం గతంలో రూ.1,050 ఉండగా రూ.1,135కి పెరిగింది. వాహన యజమాని బదిలీకి గానూ గతంలో రూ.935 ఉండగా రూ.1,805కు పెరిగింది. ఫైనాన్స్‌పై వాహనాలు తీసుకున్న వారికి ఆయా కంపనీల హామీ పత్రం(హైపోథికేషన్) ఫీజు రూ.2,135 ఉండగా రూ.3,135 అంటే ఏకంగా రూ.వెయ్యి అదనంగా పెరిగింది. రుణ బదిలీ ఫీజు రూ. 2,445 ఉండగా రూ.2,985కు పెరిగింది. ఆటో రిక్షా డ్రైవింగ్ టెస్ట్ ఫీజు రూ.800 నుంచి రూ.900లకు పెరిగింది. ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్ ఫీజు మొత్తంగా రూ.585 ఉండగా ఇప్పుడు కొన్న వాహనం రేట్‌పై 0.5 శాతం ఫీజు వసూలు చేయనున్నారు. కారు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.935 ఉండగా ఇప్పుడు 0.1 శాతం పన్ను వసూలు చేయనున్నారు. ప్రతీ వాహన ఫిట్‌నెస్‌పై అదనంగా రూ. 200 ఫీజు వసూలు చేయనున్నారు. మొత్తంగా పెరిగిన ఫీజులతో వాహనదారుల జేబులకు చిల్లు పడటం ఖాయమని తెలుస్తోంది.

సర్కారు బడుల్లో ప్రీ ప్రైమరీ

- తొలిదశలో 33 పాఠశాలల్లో అమలు
- ప్రస్తుతం మరో 17 స్కూళ్లకు గ్రీన్‌సిగ్నల్


జన్నారం మండలం పొనకల్ పాఠశాలలో ప్రీప్రైమరీ తరగతులకు హాజరైన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో మరిన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తొలిదశలో 33 బడుల్లో అమలు చేస్తుండగా మరో 17 పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాలని విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రీప్రైమరీ సెక్షన్‌కు ఒక టీచర్‌ను, ఆయాను నియమించేందుకు అనుమతులు వచ్చాయి. సర్కారు పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేవారు. ప్రస్తుతం ప్రీప్రైమరీ నిర్వహణతో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. చిన్నారులు ఒకటో తరగతిలో చేరే ముందు అందుకు సన్నద్ధతగా పూర్వ ప్రాథమిక విద్య దోహదం చేస్తోంది.

ప్రవేశాలు ఇలా..
జిల్లాలోని 33 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న ప్రీప్రైమరీలో 397 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. పీపీ–1లో 276, పీపీ–2లో 105, పీపీ–3లో 16 మంది విద్యార్థులు చేరారు. అందులో జన్నారం మండలం ఎంపీపీఎస్ అక్కెపల్లి గూడలో 34, కన్నెపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో 32, బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి ఎంపీపీఎస్‌లో 23, జన్నారం మండలంలోని కిష్టాపూర్ పాఠశాలలో 23 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందడం గమన్హారం. ఇదివరకు ప్రీప్రైమరీ బోధనకు ఆయా పాఠశాలల్లో తాత్కాలికంగా బోధకులను (స్పెషల్ టీచర్) నియమించి ఉపాధ్యాయులే వేతనం చెల్లిస్తున్నారు. సత్వరంగా ప్రభుత్వం చెల్లిస్తే బాగుంటుందని సూచిస్తున్నారు. అంతేకాకుండా ప్రీప్రైమరీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రీప్రైమరీ తరగతులు ఇవే..
జిల్లాలో మరిన్ని పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులకు అనుమతులు వచ్చాయి. ఎంపీపీఎస్ క్యాతన్‌పల్లి, ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ రాధానగర్, ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ పులిమడుగు, ప్రభుత్వ పీఎస్ దొరగారిపల్లి, ఎంపీపీఎస్ నాగసముద్రం, బలరావుపేట్, నర్సింగపూర్, మద్దికల్, కొండంపేట్, భీంపూర్–జె, అర్జునగుట్ట, లింగపూర్, కన్నెపల్లి, బోయపల్లి, గుడిపేట్, పోతనపల్లి, సింగరాయిపేట్ ఎంపీపీఎస్‌లో ప్రీప్రైమరీ తరగతులకు కొత్తగా అనుమతులు ఇచ్చారు.

అడ్మిషన్లు పెరిగేందుకు దోహదం



పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల వల్ల అడ్మిషన్ల సంఖ్య పెరిగేందుకు దోహదపడుతుంది. చిన్నారులు పాఠశాలల్లో చేరిన వెంటనే యూడైస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులకు అనువైన తరగతిగదిని సరిచూసుకోవాలి. తరగతుల నిర్వహణకు ఒక టీచర్, ఆయాను నియమించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.
– ఎస్.యాదయ్య, డీఈవో

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్


'ఇందిరమ్మ' చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

నెన్నెల: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం రైతు వేదికలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డులు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో అబ్దుల్‌హై, నాయకులు గట్టు మల్లేశ్, హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, మల్లాగౌడ్ పాల్గొన్నారు.

పత్తిమొక్కలు ధ్వంసం చేస్తున్నారని ఫిర్యాదు
కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పత్తి మొక్కలను అటవీ అధికారులు ధ్వంసం చేస్తున్నారని గిరిజనులు ఎమ్మెల్యే వినోద్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని 671, 672 సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిలో 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, పట్టాలు సైతం ఉన్నాయన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు
తాండూర్: అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం కిష్టంపేట రైతువేదికలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్‌రావు, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా, మాజీ జెడ్పీటీసీ శాలిగామ బానయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్


మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బాలికతో మాట్లాడుతున్న టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్

మంచిర్యాలటౌన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించారు. మందుల నిల్వలను పరిశీలించి వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లాలో ఈ సమయానికి 200ల మందికి పైగా డెంగీ బారిన పడ్డారని, ప్రస్తుతం 25 కేసులు నమోదయ్యాయన్నారు. రానున్న రోజుల్లో సీజనల్ వ్యాధులు, జ్వరాల బారిన పడిన ప్రజలకు చికిత్స అందించేందుకు వార్డులు, మందులు సరిపడా సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఓంసాయి ప్రైవేటు ఆసుపత్రిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్ర రెడ్డి, వైద్య విధాన పరిషత్ రాష్ట్ర బృందం డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జితేందర్, జిల్లా ఆసుపత్రుల సంచాలకులు డాక్టర్ కోటేశ్వర్‌రావు, డీడీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సేవలందించాలి
లక్సెట్టిపేట: సీజనల్ వ్యాధుల బారిన పడిన రోగులకు సేవలందించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిని పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, బయో మెడికల్ అధికారి శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్ కోటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా నియంత్రణకు చర్యలు
బెల్లంపల్లి: డెంగీ, మలేరియా నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సూచించారు. బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లిలో డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులు వెలుగుచూస్తున్నాయని, వాటిని అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు స్థానికంగానే వైద్యసేవలు అందించి వ్యాధులను అదుపులోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కోటేశ్వర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల ధర్నా


ధర్నా చేస్తున్న ఆదివాసీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆదివాసీలపై అటవీశాఖ అధికారులు దాడులు ఆపాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేక శేఖర్, పెండోల్ హన్మంతు, కనకరాజు మాట్లాడుతూ 50 ఏళ్లుగా చెన్నూర్ మండల పరిధిలో దసలిపట్టు పురుగులు పెంచుతూ, పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలు తీసుకువచ్చి ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేయాలని చూస్తోందన్నారు. జీవో 49, వైల్డ్‌లైఫ్ సంచార్‌ను శాశ్వతంగా రద్దు చేయాలని, టైగర్‌జోన్ ఎత్తివేయాలని, పోడు రైతులకు పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాంతయ్య, దుగ్నె జయాలు, గంట బాపు, అనంతరావు, రవీందర్, వెంకటేశ్, రమేశ్, అర్జున్, వెంకటరాజం, సమ్మయ్య, శ్రావణ్, కృష్ణ, కుమార్, అశోక్, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

2027 నాటికి మలేరియా నిర్మూలనే లక్ష్యం



ఢిల్లీ సమావేశంలో పాల్గొన్న శ్రీధర్

ఆదిలాబాద్‌టౌన్‌: దేశంలో 2027 నాటికి మలేరియా నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జిల్లా మలేరియా నివారణ అధికారి మెట్‌పెల్లివార్‌ శ్రీధర్‌ అన్నారు. సోమవారం న్యూ ఢిల్లీలోని నేషనల్‌ సెంటర్‌ ఫర్‌ డిసీస్‌ కంట్రోల్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమాన్ని నేషనల్‌ సెంటర్‌ ఫర్‌ వెక్టర్‌ బోర్న్‌ డిసీస్‌ కంట్రోల్‌, టీసీఐ ఫౌండేషన్‌ నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి జయశంకర్‌ భూపాలపల్లి, హైదరాబాద్‌, ఆదిలాబాద్‌ జిల్లాల నుంచి అధికారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్‌ జిల్లాలో ప్రస్తుతం ఏడాదికి 2 మలేరియా కేసులు నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను వివరించినట్లు ఆయన తెలిపారు. మలేరియాను నిర్మూలించేందుకు కృషి చేస్తున్న అధికారులను ఎన్‌సీవీబీడీసీ డైరెక్టర్‌ తనుజైన్‌ అభినందించినట్లు పేర్కొన్నారు.

జాతీయ విద్యాపాలసీ సదస్సుకు ఎంపిక



కదెర్ల రంగయ్య



సంతోష్‌ కుమార్‌

కెరమెరి/గుడిహత్నూర్‌ : కేంద్రప్రభుత్వ విద్యాశాఖ నిర్వహిస్తున్న అఖిల భారతీయ శిక్షా సమగ్రం–2025 ఆధ్వర్యంలో ఢిల్లీలోని భారత్‌ మండపంలో మంగళవారం నిర్వహించే 5వ జాతీయ విద్యా పాలసీ వార్షికోత్సవ సదస్సుకు ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఆదిలాబాద్‌ జిల్లా గుడిహత్నూర్‌ మండలం తోషం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఖెదోడ్కర్‌ సంతోష్‌ కుమార్‌, కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లా కెరమెరి మండలంలోని సావర్‌ఖెడా పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కదేర్ల రంగయ్యలు సదస్సుకు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి మొత్తం ఏడుగురు ఉపాధ్యాయులు సదస్సుకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

లీమ్‌గూడ శివారులో చిరుత సంచారం

తాంసి: మండలంలోని లీమ్‌గూడ శివారులో చిరుతపులి సంచారంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. లీమ్‌గూడ గ్రామానికి చెందిన రైతు కుమ్రం సూరజ్‌ ఆదివారం సాయంత్రం అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న పంటచేనులో పశువులు మేపుతుండగా చిరుతపులి ఒక్కసారిగా లేగదూడపై దాడిచేసింది. రైతుతో పాటు అక్కడే ఉన్న కుక్క గట్టిగా అరవడంతో చిరుతపులి అక్కడి నుంచి పారిపోయింది. వెంటనే రైతు లేగదూడను గ్రామంలోకి తీసుకొచ్చి గ్రామస్తులకు విషయం తెలియజేశాడు. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా సోమవారం అటవీ సెక్షన్‌ అధికారి అహ్మద్‌ఖాన్‌ సిబ్బందితో కలిసి చిరుతపులి గాయపర్చిన లేగదూడను, చిరుతపులి సంచరిస్తున్న అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. పంటచేనులో చిరుతపులి సంచరించినట్లుగా పాదముద్రలు లభించలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు అవగాహన కల్పించారు. బీట్‌ అధికారి సాయి కుమార్‌, శరత్‌రెడ్డి ఉన్నారు.

టైగర్‌ లేని జోన్‌!

జీవ వైవిధ్యంలో పెద్దపులి పాత్ర ఎంతో గొప్పది. పులి ఉన్నచోట దట్టమైన అడవులుంటాయి. వాతావరణంలో సమతుల్యత ఏర్పడుతుంది. పచ్చని అడవులు సంరక్షించబడుతాయి. అలాంటి పులుల సంతతి పెంచేందుకు తెలంగాణలో రెండో టైగర్‌జోన్‌గా కవ్వాల్‌ టైగర్‌జోన్‌ ఏర్పాటు చేశారు. దట్టమైన అడవులు, సరిపడా వన్యప్రాణులు, పది పులులు సైతం స్వేచ్ఛగా సంచరించేందుకు వీలుగా ఉండే ఈ అడవుల్లో ఆవాసం ఏర్పాటు చేసుకోవడంలో పులి ఎందుకో ముఖం చాటేస్తుంది. ఇక్కడికి రాకపోకలతోనే సరిపెడుతుంది. కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఇక్కడ పులి ఆవాసం ప్రశ్నార్థకంగా మారింది. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా కవ్వాల్‌ టైగర్‌ జోన్‌లో పులి సంచారంపై ప్రత్యేక కథనం.. – జన్నారం



2021లో జన్నారం డివిజన్‌లో కెమెరాకు చిక్కిన పులి

- రాకపోకలతోనే సరిపెడుతున్న పులి
- సౌకర్యాలు కల్పిస్తున్నా చుట్టపు చూపే..
- మూడేళ్లుగా కానరాని జాడ
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

కవ్వాల్‌ అభయారణ్యం దట్టమైన అడవులు, వివిధ రకాల వన్యప్రాణులకు నెలవు. చెంగుచెంగున ఎగిరే వన్యప్రాణులు, జలజల సవ్వడి చేసే జలపాతాలు, కిలకిలరావాలు పలికే పక్షులు వీటన్నింటి కలబోతగా కవ్వాల్‌ అభయారణ్యం నిలుస్తోంది. కవ్వాల్‌ అభయారణ్యాన్ని 2012 ఏప్రిల్‌ 10న పులుల రక్షిత ప్రదేశంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ అభయారణ్యంలో 893 చ.కి.మీ కోర్‌ ఏరియా, 1123 చ.కి.మీ బఫర్‌ ఏరియాగా పేర్కొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు జిల్లాల నుంచి ఆరు డివిజన్లుగా విభజించి కవ్వాల్‌ సర్కిల్‌ ఏర్పాటు చేసింది. ఈ అడవుల్లో పులికి ఇష్టమైన దుప్పులు, కొండగొర్రెలు, మేకాలు, నీలుగాయిలు, సాంబార్లు, చుక్కల దుప్పులు, అడవి పందులు వంటి శాఖాహార జంతువులు, చిరుతలు, ఎలుగు బంట్లు, అడవికుక్కలు, నక్కలు, తోడేళ్లు వంటి మాంసాహార జంతువులు ఆవాసం ఉంటున్నాయి. ఐదేళ్లుగా అడవిలో గడ్డి క్షేత్రాలు, నీరు, ఆవాసం వంటి సౌకర్యాలు కల్పిస్తుండటంతో శాఖాహార జంతువుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా పులి రాకపోకలు సాగించడమే తప్పా ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకోవడం లేదు.

2022లో కనిపించిన పులి..

కవ్వాల్‌ టైగర్‌జోన్‌లోని జన్నారం, ఖానాపూర్‌, ఉట్నూర్‌, ఆసిఫాబాద్‌ డివిజన్‌లలో పులి పలుమార్లు రాకపోకలు కొనసాగించింది. కవ్వాల్‌ టైగర్‌జోన్‌ పరిసర పరిధిలో తిప్పేశ్వర్‌, తాడోబా, ఇంద్రావతి టైగర్‌జోన్‌లు ఉన్నాయి. ఆయా టైగర్‌జోన్‌ల నుంచి పులులు కవ్వాల్‌ టైగర్‌జోన్‌లోకి రాకపోకలు కొనసాగించాయి. 2016 నుంచి 2022 వరకు దొంగపల్లి, అలీనగర్‌, ఖానాపూర్‌ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో పులి కెమెరాలకు చిక్కింది. అలీనగర్‌, దొంగపల్లి ప్రాంతాలలో పలు పశువులను సైతం వేటాడింది. కవ్వాల్‌ టైగర్‌జోన్‌లో పులి అడుగులు వేస్తున్నా ఎందుకో ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. 2022లో ఖానాపూర్‌ డివిజన్‌లో కనిపించింది. ఇక మూడేళ్లుగా కవ్వాల్‌ అటవీ డివిజన్‌ సరిహద్దులోని మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్‌, ఆదిలాబాద్‌, నిర్మల్‌ జిల్లాల్లో సంచరిస్తున్న పులులు.. టైగర్‌ జోన్‌లో అడుగు పెట్టకుండానే వెనుదిరుగుతున్నాయి.

పులి ఆవాసం కోసం అభివృద్ధి..

కవ్వాల్‌ టైగర్‌జోన్‌లో అత్యధికంగా అడవి, ఆవాస యోగ్యం, వన్యప్రాణులున్న ప్రాంతంగా జన్నారం అటవి డివిజన్‌ ఉంది. టైగర్‌జోన్‌లో 22 శాతం మాత్రమే జన్నారం డివిజన్‌లో ఉంది. పులి ఆవాసం ఏర్పాటు చేసుకునేలా అధికారులు అనేక చర్యలు చేపడుతున్నారు. కాంపా, కేంద్ర ప్రభుత్వ నిధులతో అడవుల్లో కుంటల నిర్మాణం, గడ్డి క్షేత్రాలు, సాసర్‌ వెల్స్‌, బేస్‌క్యాంపుల నిర్వహణ, ఎనిమల్‌ ట్రాకర్స్‌, తదితర అభివృద్ధి పనులతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గత నాలుగేళ్లలో 900 హెక్టర్లలో గడ్డి క్షేత్రాలను ఏర్పాటు చేశారు. ఫలితంగా జన్నారం అటవి డివిజన్‌లో వన్యప్రాణుల సంఖ్య సైతం రెట్టింపయ్యింది.

కారణాలు అనేకం..

పులి చాలా బరువైన జంతువు. తేలిగ్గా వేటాడటానికి ఇష్టపడుతుంది. అందుకే గడ్డి మాటున వన్యప్రాణులను చూసి వాటిపైకి దూకి వేటాడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. పులి పలుమార్లు జన్నారం డివిజన్‌కు వస్తూ వెళ్తూ ఉంది. ఇక్కడ దట్టమైన టేకు వనం ఉండడంతో పాటు గుబురైన పొదలు, ఇతర పలు రకాల చెట్లు పులి వేటకు చెక్‌ పెడుతున్నాయి. అదే విధంగా పులికి అలజడి లేకుండా ఉంటేనే ఆవాసం ఏర్పాటు చేసుకునే వీలు ఉంటుంది. కానీ ఇక్కడి డివిజన్‌లో పలు రకాల అలజడుల వల్ల పులి ఇక్కడ ఉండటం లేదని అటవీ అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందికరంగా పులి కారిడార్‌..



తాడోబా, ఇంద్రావతి, తిప్పేశ్వర్‌లో అనేక పులులున్నాయి. అక్కడి నుంచి పులులు కవ్వాల్‌ టైగర్‌జోన్‌కు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం పులి వచ్చే కారిడార్‌ ఇబ్బందికరంగా మారింది. జనావాసాలు పెరిగాయి. కాలువలు, పొలాలు పెరగడంతో పులి రాకపోకలు నిలిచిపోయాయి. జన్నారం అడవులు పులికి అనువైన ప్రదేశం. పులులు ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకోవాలంటే వన్యప్రాణుల సంఖ్య పెరగాలి. అందుకోసం కొన్నేళ్లుగా గడ్డి పెంచుతున్నాం. దీంతో వన్యప్రాణుల సంఖ్య పెరిగింది. ఆలస్యంగానైనా పులి ఈ ప్రాంతానికి తప్పక వస్తుంది.– రామ్మోహన్‌, డివిజనల్‌ అటవీ అధికారి, జన్నారం

'సోయం బాపూరావును విమర్శిస్తే సహించేది లేదు'



మాట్లాడుతున్న మంగం విశ్వంరావు

ఉట్నూర్‌రూరల్‌: రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ సోయం బాపూరావును వ్యక్తిగతంగా విమర్శిస్తే సహించేది లేదని రాజ్‌ గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విశ్వంరావు హెచ్చరించారు. సోమవారం ఉట్నూరు మండల కేంద్రంలో ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఆయనపై కొందరు పనిగట్టుకొని వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారన్నారు. సీఎంను కలిసి జీవో 49ను తాత్కాలికంగా రద్దు చేయించిన ఘనత సోయం బాపూరావుదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం నిరంజన్‌, నాయకులు ఆత్రం ప్రకాశ్‌, ఆత్రం కాశిరాం, పురుకా గజానంద్‌, సీడాం కృష్ణ, తొడసం భీమరావ్‌ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో

సాత్నాల: భోరజ్‌ మండలం తర్నంలో బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం సోమవారం ఆకుర్ల గ్రామానికి చెందిన రాహుల్‌, నితిన్‌ ఆదిలాబాద్‌ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా, బొలెరో వాహనం బైకును ఢీ కొట్టింది. నితిన్‌కు తీవ్ర గాయాలు కాగా మహారాష్ట్రలోని యావత్‌మాల్‌కు తరలించారు. రాహుల్‌తో పాటు బొలెరో వాహనంలోని ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

మత్తుమందు సరఫరా.. నలుగురు అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్‌ మీనా

నిర్మల్‌టౌన్‌: మత్తు మందులను (ఇంజక్షన్లు) యువతకు సరఫరా చేస్తున్న నలుగురిని అరెస్టు చేయడంతో పాటు మత్తు పదార్థాలకు అలవాటుపడిన మరో ముగ్గురిని బైండోవర్‌ చేసినట్లు నిర్మల్‌ ఏఎస్పీ రాజేశ్‌ మీనా తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. నిర్మల్‌ పట్టణానికి చెందిన షేక్‌ మతినొద్దీన్‌ అలియాస్‌ మతిన్‌ మాఫియా, మొహమ్మద్‌ పర్వేజ్‌, షేక్‌ అద్నాన్‌, సయ్యద్‌ షాన్వాజ్‌ అనే నలుగురు నోమాన్‌ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేయంతో పాటు నిషేధిత మీఫ్రెంటెర్మినే సల్ఫేట్‌ అనే మత్తు మందులను వివిధ ఆసుపత్రుల నుంచి దొంగిలించారు. యువతకు వీటిని అలవాటు చేసి డబ్బు సంపాదించేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక బైల్‌ బజార్‌ మార్కెట్‌ యార్డ్‌ ప్రాంతంలో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 100 గ్రాముల నిషేధిత గంజాయి, మూడు మత్తుమందు ఇంజక్షన్లు, మూడు సిరంజీలు, ఒక ఆటో, నాలుగు మొబైల్‌ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మత్తుకు అలవాటు పడిన మహమ్మద్‌ మినజోద్దీన్‌, తోకల రాజేశ్వర్‌, గణేశ్‌లను బైండోవర్‌ చేశారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ ప్రవీణ్‌ కుమార్‌, ఏఎస్సై అజయ్‌ చౌహాన్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ రవి, కానిస్టేబుల్‌ అవినాశ్‌లను ఏఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి



ఆడె నరేశ్‌ (ఫైల్‌)

భైంసాటౌన్‌: ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కుభీర్‌ మండలం సిర్పెల్లి తండాకు చెందిన ఆడె నరేశ్‌(50) ముధోల్‌లోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం పాఠశాలకు బైక్‌పై వెళ్తుండగా, పట్టణంలోని సేవాలాల్‌ చౌక్‌ వద్దకు చేరుకోగానే, నిజామాబాద్‌ నుంచి భైంసా వస్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్‌ బస్సు ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు తీవ్ర గాయం కాగా, స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య అనితాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవనీత్‌ రెడ్డి తెలిపారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ.. ఒకరి మృతి

భైంసారూరల్‌: మండలంలోని దేగాం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై శంకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్‌ మండలం గోడాపూర్‌కు చెందిన గర్కే ప్రవీణ్‌ (32) పని నిమిత్తం నిజామాబాద్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆదివారం రాత్రి తన ద్విచక్రవాహనంపై భైంసాకు వస్తుండగా భైంసా నుంచి బాసర వైపునకు వెళ్తున్న ఆటో ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ప్రవీణ్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై వెల్లడించారు.

చికిత్స పొందుతూ వివాహిత..



మౌనిక(ఫైల్‌)

లక్సెట్టిపేట: మండలంలోని అంకతిపల్లి గ్రామానికి చెందిన మౌనిక (29) అనే వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మౌనికకు హాజీపూర్‌ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన సింగరేణి ఉద్యోగి మహేశ్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల పాప, ఏడాది బాబు ఉన్నారు. ఈక్రమంలో గత రెండు నెలల నుంచి తల్లిగారింటి వద్దే ఉంటున్న మౌనిక ఈనెల 24న ఇంటి ఆవరణలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడే ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



నీరటి నరేశ్‌ (ఫైల్‌)

దస్తురాబాద్‌: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో దైవకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నీరటి నరేశ్‌(23)కు ప్రవళికతో మూడు నెలల క్రితం వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య సఖ్యత లేకపోవడం.. భార్య ప్రవళిక అనారోగ్యంతో పుట్టింటి వద్దనే ఉండటంతో మనస్తాపం చెందిన నరేశ్‌ శనివారం పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌ ప్రైవేట్‌ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం నరేశ్‌ మృతి చెందాడు.

జీవితంపై విరక్తితో యువకుడు..

మంచిర్యాలక్రైం: జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్సై వెంకన్న గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్‌ మండలం శీలపల్లి గ్రామానికి చెందిన బూసినేని బాలకృష్ణ (26) డిగ్రీ పూర్తి చేసి పని లేకుండా ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈక్రమంలో పని చూసుకునేందుకు హైదరాబాద్‌కు వెళ్తానని చెప్పి ఈనెల 25న ఇంటి నుంచి బయలుదేరాడు. 26న రాత్రి జిల్లా కేంద్రంలోని రైల్వే ఓవర్‌ బ్రిడ్జి కింద గుర్తు తెలియని పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అనంతరం తానే స్వయంగా వెళ్లి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆయనను వరంగల్‌ ఎంజీఎంకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ 27న రాత్రి మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నెమ్మదిగా వెళ్లమన్నందుకు దాడి

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి గ్రామానికి చెందిన గిన్నె సతీశ్‌ అనే వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు కాసిపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ముత్యంపల్లి పెద్దమ్మ గుడి సమీపంలో ఆదివారం రాత్రి 8.30 గంటలకు సతీశ్‌ నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈక్రమంలో ముత్యంపల్లికి చెందిన ముదురకోల రాజు, ఆవుల రాజేందర్‌లు బైక్‌పై అతివేగంతో రాగా నెమ్మదిగా వెళ్లాల్సిందిగా సతీశ్‌ సూచించాడు. దీంతో ఇద్దరు కలిసి సతీశ్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. సతీశ్‌ను పక్కకు నెట్టివేయడంతో బండరాయిపై పడి ముఖానికి, తలకు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై తెలిపారు. కాగా కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించినటలు పేర్కొన్నారు. బాధితుడి సోదరి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాగమ్మా.. దీవించు

- నేడు నాగుల పంచమి
- పుట్టలో పాలు పోయడం ఆనవాయితీ
- గ్రామీణ ప్రాంతాల్లో అధిక ప్రాధాన్యం
- శ్రావణ శుక్ల పంచమి నాగారాధనకు శ్రేష్ఠం



పుట్టలో పాలు పోస్తున్న మహిళలు (ఫైల్‌)



ఉయ్యాల ఊగుతున్న మహిళలు

కెరమెరి(ఆసిఫాబాద్‌): నేడు నాగుల పంచమి.. శ్రావణ శుక్లపంచమి నాగారాధనకు శ్రేష్ఠమని గ్రామీణులు విశ్వసిస్తారు. అందుకే ఇతరత్రా పండుగల మాదిరి నాగపంచమిని కూడా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భారతీయ సంప్రదాయాల్లో మనుషులకు, నాగులకు అధిక ప్రాధాన్యత ఉంది. అందుకే మహిళలు పాము పుట్టల్లో పాలు పోసి తమ భక్తిని చాటుకుంటారు. నవధాన్యాలతో తయారు చేసిన పుట్నాలను సైతం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి ఆదిలా బాద్‌ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు మంగళవారం నాగుల పంచమిని భక్తి శ్రద్ధలతో జరుపుకో నున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అక్కాచెల్లెళ్లు ఉయ్యాలలు ఊగుతూ ఎంతో ఆనందంగా గ డుపుతారు. ఇది ఆనవాయితీగా వస్తున్న ఆచారం.

ఇదీ కథ..

హస్తినపురం రాజైన జనమే జయుడి తండ్రి పరీక్షిత్తు మహారాజు నాగుపాము కాటు వేయడంతో మరణిస్తాడు. అతనిపై ప్రతీకారం తీర్చుకోవడానికి జనమే జయుడు సర్పయాగం చేస్తాడు. ఈ యజ్ఞంలో మంత్ర శక్తి ద్వారా నాగులను రప్పించి యజ్ఞగుండంలో ఆహుతి చేస్తాడు. జనమే జయుడి సర్పయాగంలో కోట్లాది నాగులు భస్మమై పోతాయి. మనసాదేవి కుమారుడు హస్తికముని ఈ యజ్ఞాన్ని నిరోధిస్తాడు. నాగయజ్ఞం ముగిసిన రోజునే పంచమ తిథి కావడంతో నాగుల పంచమి జరుపుకుంటున్నారు. ఓం నమఃశివాయ.. ఓం నమఃశివయా.. నాగేంద్రహరాయ ఓం నమోఃశివయా అనే నాగ గాయత్రి తొలిమంత్రం వల్ల లేదా శివమంత్రం పఠించడం వల్ల సౌభాగ్యకరమైన..శుభప్రదమైన ఫలితం లభిస్తుందని శాస్త్రవచనం.

నాగరాజుకు నైవేద్యాలు...

శ్రావణ శుద్ధ చతుర్థి రోజున స్త్రీలు ఉపవాసం ఉండి, జాజి సంపెంగ పుష్పాలతో పూజించి పుట్టలో పాలు, పాయసం, కలివిడి, పప్పు, వడ, నువ్వులతో చేసిన ఉండలు, క్షీరాన్నం నాగేంద్రునికి సమర్పిస్తే సర్వదోషాలు హరిస్తాడని, సంతానంలో అవరోధాలు లేకుండా చూస్తాడని భక్తుల విశ్వాసం. నాగుల చవితి, నాగపంచమినాడు నాగదేవతను ఆరాధిస్తే కాలసర్పదోషం, రాహుగ్రహ దోషం తొలగిపోతాయని పురాణాలు చెబుతున్నాయి.

నాగవ్రతంతో మేలు

నాగుల పంచమి రోజున శాస్త్రోక్తంగా నాగవ్రతం ఆచరిస్తే సంతానం కలుగుతుందని, అన్ని కార్యాలు సులభంగా జరుగుతాయని ప్రజల నమ్మకం. స్త్రీ, పురుషుల జాతకంలో సర్పదోశం ఉంటే వారు శుద్ధ పంచమినాడు నాగవ్రతాన్ని ఆచరించి ప్రతీనెల శుక్ల పంచమికి ఈ వ్రతం చేస్తే సకలప్రాప్తి కలుగుతుందని ప్రతీక. ఈ నేపథ్యంలో నవధాన్యాలతో పుట్నాలను చేసి తియ్యటి పరమాన్నంతో పాటు పాలను పుట్టలో పోయడంతో అంతా శుభం జరుగుతుందని భక్తుల విశ్వాసం.

ఉత్సాహంగా..



నాగుల పంచమిని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటాం. ఉదయాన్నే ఇల్లంతా శుభ్రం చేసి నూతన వస్త్రాలను ధరిస్తాం. నవధాన్యాలతో పుట్నాలను తయారు చేస్తాం. ఆ తర్వాత పుట్టలో పాలు పోస్తాం. భక్తి శ్రద్ధలతో నాగరాజును ఆరాధిస్తాం. అనాదిగా వస్తున్న ఈ ఆచారాన్ని నేటికీ పాటిస్తున్నాం.
– విజయలక్ష్మి, మాజీ సర్పంచ్‌, ఖైరీ, కెరమెరి

నాగోబా ఆలయం ముస్తాబు



నాగోబా ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలు, రంగులరాట్నం

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్‌ నాగోబా ఆలయంలో మంగళవారం నిర్వహించే నాగుల పంచమి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. రెండురోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌ తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. నాగుల పంచమి పురస్కరించుకొని వాలీబాల్‌, కబడ్డీ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీఐ మడావి ప్రసాద్‌ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముల్తానీల దాడి కేసులో 30 మంది అరెస్ట్‌

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన కొంత మంది ముల్తానీలు పోలీసులపై రాళ్లతో దాడి చేసిన సంఘటనలో ఇప్పటి వరకు 30 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ఈ నెల 20న సిరిచెల్మ అటవీప్రాంతంలో బందోబస్తుకు వెళ్లిన పోలీసులపై కేశవపట్నం గ్రామానికి చెందిన ముల్తానీలు కొంత మంది దాడి చేశారు. దాడిలో ఎస్సైతో పాటు నలుగురు పోలీసులు గాయపడ్డారు. ఎస్పీ అఖిల్‌ మహాజన్‌ ఆదేశాల మేరకు దాడికి పాల్పడిన 30 మందిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌ తరలించారు. దాడితో ప్రమేయం ఉన్న మరో 30 మంది కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. దాడి చేసిన ప్రధాన నిందితులు పోలీసులకు చిక్కకుండా అటవీ ప్రాంతంలో దాక్కున్నట్లు తెలుస్తోంది.


కుక్కల దాడిలో గొర్రెలు మృతి



ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని యాపల్‌గూడకు చెందిన పశు పోషకుడు లయరీ కిష్టయ్యకు చెందిన గొర్రెల మందపై ఆదివారం అర్ధరాత్రి వీధి కుక్కలు దాడి చేశాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగానే ఆదివారం గొర్రెలను కొట్టంలో ఉంచాడు. వీధి కుక్కలు గుంపుగా వచ్చి గొర్రెల మందపై ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో 13 గొర్రెలు మృతి చెందగా నాలుగు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన గొర్రెల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



భోజనం చేస్తున్న వారితో మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్‌: గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇంటి నిర్మాణ బిల్లు మంజూరు చేయాలని, అంబులెన్స్‌లో డ్రైవర్‌గా ఉపాధి కల్పించాలని, బోర్‌వెల్‌, సోలార్‌ మంజూరు చేయాలని, మృతి చెందిన ఎద్దులకు ఆర్థికసాయం చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీదారులు దరఖాస్తులు చేసుకున్నారు.

ఆహారంలో నాణ్యత పాటించాలి..

ఉట్నూర్‌ పట్టణంలో సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ –జంగుబాయి గ్రూపు సభ్యులు నిర్వహిస్తున్న గిరిజన క్యాంటీన్‌లో ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించాలని పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం గిరిజన క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి సామగ్రి, పరిసరాలు పరిశీలించారు. భోజనం చేస్తున్న వారిని నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉట్నూర్‌ కేంద్రంలో ఐటీడీఏ ద్వారా నిర్వహిస్తున్న పెట్రోల్‌ బంకును పీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జంగుబాయి గ్రూపు సభ్యులు శేఖర్‌, టోకెన్‌ ఇన్‌చార్జి అనిల్‌ యాదవ్‌, బంక్‌ మేనేజర్‌ నవజ్యోత్‌ పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌లు పంపిణీ..

ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ఉన్నత విద్య కోర్సుల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ల్యాప్‌టాప్‌లను ఖుష్బూ గుప్తా అందించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని పట్టుదలతో సాధించాలని ఆకాంక్షించారు.

కులం పేరుతో దూషించిన ఐదుగురికి జైలు

ఆదిలాబాద్‌టౌన్‌: కులం పేరుతో దూషించిన ఐదుగురికి ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ స్పెషల్‌ సెషన్స్‌ కోర్టు జడ్జి కుమార్‌ వివేక్‌ తీర్పునిచ్చినట్లు లైజన్‌ అధికారి పండరి సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బేల మండలంలోని టాక్లి గ్రామానికి చెందిన బాధితుడు కనక మారుతి 2023 జూన్‌ 13న ఉదయం కౌలుకు తీసుకున్న నరేంద్ర చేనులో విత్తనాలు వేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన బండేకర్‌ సకారాం, బండేకర్‌ శంకర్‌, బండేకర్‌ మంగేష్‌, బండేకర్‌ తేజస్‌, బండేకర్‌ మంగళలు విత్తనాలు వేయకుండా అడ్డుకున్నారు. కులం పేరుతో దూషించడంతో పాటు ఆయనపై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి డీఎస్పీ ఉమేందర్‌ విచారణ చేపట్టి చార్జ్‌షీట్‌ దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసు అధికారి జమీర్‌ తొమ్మిది మంది సాక్షులను ప్రవేశపెట్టగా, పీపీ ముస్కు రమణారెడ్డి నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు. నిందితులకు శిక్ష పడడంతో జిల్లా ఎస్పీ అఖిల్‌ మహాజన్‌ పోలీసు సిబ్బందిని అభినందించారు.